ప్రభుత్వస్థలాలు అన్యాక్రాంతం

- సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆగ్రహం
- ప్రభుత్వ స్థలాలకు హద్దులు నిర్ణయించాలని వినతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కునారపు రేణుకదేవి

ఓదెల: మండలంలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సర్పంచులు ప్రభుత్వ స్థలాల అన్యాక్రాంతంపై ప్రశ్నించారు. గోపరపల్లె సర్పంచు కర్క మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో 1327 సర్వే నంబర్‌లో దర్శకంచె భూములు రూపురేఖలు మారాయన్నారు. ప్రస్తుతం నూతన గ్రామపంచాయతీ నిర్మాణానికి, క్రీడాప్రాంగణాలకు స్థలాన్ని కేటాయించాలన్నారు. గూడెం శివారులో నక్కల ఒర్రె ఆక్రమణకు గురై కందకంలాగా తయారైందని సర్పంచ్ గోవిందుల ఎల్లస్వామి అన్నారు. గుంపుల హైస్కూలుకు దాత ఇచ్చిన స్థలాన్ని కొందరూ కబ్జా చేశారని, దీంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయని సర్పంచ్ చిరంజీవి తెలిపారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి హద్దులను నిర్ణయిస్తామని తహసీల్దార్ కె రమేశ్ తెలిపారు. భూమిలేని నిరుపేదలు డబల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తులను చేసుకోవాలన్నారు. కొలనూర్ సర్పంచ్ సామ మణెమ్మ మాట్లాడుతూ మంచినీటి మోటార్ కాలిపోయిందని వాటికి బిల్లులు చెల్లించకపోవటంతో గ్రామంలో మంచినీటి ఎద్దడి నెలకొందని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. జీలకుంట ఎంపీటీసీ రాగిడి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కోతలతో పంట పొలాలు ఎండిపోతున్నాయని, రైతులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మండల ఏవో నాగార్జున మాట్లాడుతూ పంటలకు సోకుతున్న ఎండు, మొగిపురుగు నివారణకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పశువైద్యాధికారి కె కుమారస్వామి మాట్లాడుతూ మండలంలోని గుంపుల, మడక, పొత్కపల్లి, కనగర్తి గ్రామాల్లోని పశువైద్యశాలలకు పక్కాభవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇందుర్తి సర్పంచు అంబాల సంధ్యారాణి మాట్లాడుతూ మనఊరు మనబడి కింద పాఠశాల, జీపీ భవనాలను డీస్‌మెటల్ చేయాలని కోరితే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి సత్తయ్య, మిషన్‌భగీరథ డీఈఈ సతీశ్, ఎంపీవో వాజీద్, మండల కోఆప్షన్ మెంబర్ షాహిత్‌అలీ, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

గోదావరిఖనిటౌన్: వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా వినియోగదారులకు విద్యుత్ సమస్యల విషయంలో అవగాహన కల్పించేందుకే సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులు ఎలాంటి సమస్యలున్నా నేరుగా గాని వాట్సాప్ (9440811299, 8333923840, 9491307004) నెంబర్‌లలో, ఆన్‌లైన్, ఈ మెయిల్ నుంచి ఐక్య వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీఈ తిరుపతి, గోదావరిఖని ఏడీఈ శ్రీనివాస్, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ పట్టివేత


పోలీస్‌స్టేషన్ పక్కన టిప్పర్

సుల్తానాబాద్: అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున సుల్తానాపూర్ గ్రామానికి చెందిన యువకులు 100కు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పోలీసులు టిప్పర్ పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారని, ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా రాత్రి వేళలో అక్రమంగా మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అనుమతులు లేకుండా మట్టితోపాటు ఏలాంటి అక్రమ రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనింగ్ శాఖకు అప్పజెప్పనున్నట్లు తెలిపారు.

కంటి వెలుగు శిబిరాలు పరిశీలన


కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు పరిశీలించారు. కంటి వెలుగు నిర్వహణ తీరును నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్ తనిఖీ చేశారు. శిబిరంలో మెడికల్ ఆఫీసర్ పవన్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు 'కంటి వెలుగు' పరీక్షలు చేయించుకోవాలి

జూలపల్లి: ప్రజలు కంటి వెలుగు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి సూచించారు. మండలంలోని వడ్కాపూర్‌లో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ మూంకాశి తిరుపతి, మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల రావు, ఎంపీవో కిరణ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన కంటివెలుగు వైద్యశిబిరం

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ వర్కర్స్‌క్లబ్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు వైద్యశిబిరం శుక్రవారం ముగిసింది. దాదాపు 20రోజుల పాటు కొనసాగిన ఈవైద్యశిబిరంలో మొత్తం 2551 మందికి కంటిపరీక్షలు నిర్వహించి వారిలో 328 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. 273మందికి ఆపరేషన్ అవసరమున్నట్లు గుర్తించడంతో పాటు మరో 173 మందికి అవసరమైన కంటి అద్దాల కోసం ఆర్డర్ చేసినట్లు సిబ్బంది తెలిపారు. ఈసందర్భంగా వైద్య సిబ్బందిని సర్పంచ్ వేణుగోపాల రావు సన్మానించారు.

పాడవుతున్న మిషన్‌భగీరథ పైపులు


రెండేళ్లుగా చెట్టు కింద పడేసిన మిషన్ భగీరథ పైపులు

రామగిరి: రాజుల సొమ్ము రాళ్ల పాలన్నట్లుగా మిషన్ భగీరథ అధికారులు వ్యవహరిస్తున్నారు. రామగిరి మండలం నాగేపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని చెట్టు కింద రెండేళ్లుగా పీవీసీ పైపులు పాడైపోతున్నా పట్టించుకునే నాథుడే కరువైయ్యారు. మూడేళ్ల క్రితం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఇవే పైపులను నిల్వచేశారు. అయితే అక్కడ స్థలం కొరత కారణంగా ఇబ్బందికరంగా మారడంతో తీసుకువచ్చి పాఠశాల ఆవరణలోని చెట్టు కింద పడవేశారు. దాదాపు మూడేళ్లుగా ఆరుబయటే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్న పీవీసీ పైపులు ఇప్పుడు పైపులైన్‌లలో వినియోగిస్తే ఎంతకాలం ఉపయోగపడతాయని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పైపుల కంపెనీలు ఇచ్చే కమిషన్ల కోసం ముందస్తు ప్రణాళికలు లేకుండా లక్షలాది రుపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన పైపుల పరిస్థితి ఇలా మారడానికి సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కమాన్‌పూర్ ఎంపీవోగా శేషయ్య సూరి



కమాన్‌పూర్: మండల పంచాయతీ అధికారిగా(ఎంపీవో)గా శేషయ్య సూరి శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న ఆరీఫ్ హుస్సేన్ మంథనికి బదిలీ కాగా, మంథనిలో పని చేస్తున్న శేషయ్యసూరి కమాన్‌పూర్‌కు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు.

టాటా మ్యాజిక్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విద్యాసాగర్


విద్యాసాగర్

కోల్‌సిటీ: గోదావరిఖని టాటా మ్యాజిక్ ఓనర్స్, డ్రైవర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా మారపల్లి విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ డిపో సమీపంలో నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కోరుకంటి చందర్, అధ్యక్షుడిగా మారపల్లి విద్యాసాగర్, ఉపాధ్యక్షుడిగా తాటిపాముల లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొమ్మక సదానందం, ముఖ్య సలహాదారులుగా తీగుట్ల కనకయ్య, అడ్లూరి రాములు, బట్టల అశోక్‌గౌడ్, కోశాధికారిగా రావుల సదానందం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆయిల్‌పామ్ పంటలో అంతర పంటల సాగు


అంతరపంటగా సాగు చేసిన నువ్వు

సుల్తానాబాద్‌రూరల్: ఆయిల్‌పామ్ సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం రాయితీ కల్పించడం, అధికారుల విస్తృత ప్రచారం, అవగాహన కల్పించడంతో సుల్తానాబాద్ మండలంలో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు వచ్చారు. దీంతో ఆయిల్‌పామ్ సాగుతో పాటు నాలుగేళ్లు అంతర్‌పంటగా వివిధ పంటలు వేసుకునే వీలుండగా బొంతకుంటపల్లిలో ఓ రైతు నువ్వుల సాగు చేస్తున్నారు.

షుగర్ టెస్ట్ మిషన్లు అందజేత


టెస్టింగ్ కిట్‌లు అందిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల పంచాయతీకి శుక్రవారం బహుజన సామాజిక నాయకుడు కన్నూరి శ్రీశైలం రెండు షుగర్ టెస్ట్ మిషన్లను సర్పంచ్ లావణ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పర్శరాం, ఏఎన్‌ఎం స్వరూప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా గాలిగోపురం నిర్మాణ పనులు



రామగుండం: అబాది రామగుండంలోని ప్రముఖ బ్రహ్మసూత్ర శివలింగం కలిగిన శ్రీ కాశి విశ్వేశ్వరాలయ గాలి గోపుర నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కాగా గతంలో గడీల గుడిగా పేరొందిన వాటిని స్థానికుల చొరవతో మట్టి కుప్పల్లో కప్పుకుపోయిన శివలింగం, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను వెలికితీసి ఆలయం నిర్మించారు. అనంతరం సదరు శివలింగం బ్రహ్మసూత్ర (లింగం పై చారలు కలిగి ఉండడం) లింగం కావడం, ప్రత్యేకంగా అబాది రామగుండంలోని బ్రహ్మసూత్ర శివలింగం ప్రాధాన్యత, ప్రాముఖ్యతను బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మీడియాలో వివరించడంతో భక్తులు దర్శనానికి బారులు తీరుతున్నారు. ఫలితంగా ఆలయానికి భక్తుల తాకిడిని గుర్తించి నూతనంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసి ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

క్లుప్తంగా

డ్రైయినేజీ పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ స్రవంతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పాలితంలో శుక్రవారం డ్రెయినేజీ పనులను ఎంపీపీ స్రవంతి ప్రారంభించారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.3 లక్షలతో పనులు చేపట్టారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సర్పంచ్ కారం పద్మ, ఎంపీటీసీ లక్ష్మి, నాయకులు రాజేశం, రవీందర్ తదితరులున్నారు.

బీసీలకు న్యాయం చేయాలి


పెద్దపల్లిలో కొనసాగుతున్న రిలేదీక్షలు

పెద్దపల్లిరూరల్: బీసీ కులాలకు న్యాయం చేసేందుకు వీలుగా పాలకులు రిజర్వేషన్లను పెంచాలని పద్మశాలీ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజేందర్ అన్నారు. బీసీల జనాభాను బట్టి రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో 16 రోజులుగా చేపట్టిన రిలే దీక్ష శిబిరాన్ని శుక్రవారం సందర్శించి మాట్లాడారు. ఇప్పటివరకు బీసీ జనాభాకు అనుగుణంగా పాలకులు చేసిందేమీ లేదన్నారు. బీసీల జనాభాను బట్టి రిజర్వేషన్లను పెంచేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు కుమ్మరి సవిత, శేషాద్రి, సాదిక్, ఫహీమొద్దిన్, శ్రీధర్, రవితేజ, అజయ్, శ్రీధర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ చేయాలి


గుడ్లు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

సుల్తానాబాద్: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో అర్హులకు అందజేయాలని సుల్తానాబాద్ స్పెషల్ ఆఫీసర్, జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి భాస్కర్ అన్నారు. శుక్రవారం పలు కేంద్రాలను ఆయన సందర్శించారు. గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం మెనూ ప్రకారం పంపిణీ జరగాలన్నారు

అగ్ని ప్రమాదాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పెద్దపల్లిరూరల్: అగ్నిప్రమాదం సంభవించినపుడు వాటిని నియంత్రించేందుకు పాటించాల్సిన పద్ధతులపై కనీస అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి అగ్నిమాపకశాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. స్థానిక గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించారు. వంటగదిలో వినియోగించే గ్యాస్ సిలిండర్ లీకై అగ్నిప్రమాదం సంభవిస్తే, ఎలక్ట్రిక్ షాక్‌సర్క్యూట్, రోడ్డు ప్రమాదాలు, వరదలు, భూకంపాలవల్ల ప్రమాదాలు తలెత్తినపుడు అనుసరించాల్సిన పద్ధతులపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సిరాజుద్దీన్, చంద్రయ్య, శ్రావణ్, నరేందర్ పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందించాలి

ధర్మారం: వికలాంగులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు కార్డులు అందించాలని వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రేండ్ల నరేశ్ రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు లేక రాశారు. గతంలో అంగన్‌వాడీ టీచర్లతో గ్రామాల్లో వికలాంగులను గుర్తించి వారి వివరాలను సంబంధితశాఖకు పంపిస్తే (యూడీఐడీ కార్డులు) గుర్తింపు కార్డులు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసినా కార్డులు ఇప్పటి వరకు ఇవ్వ లేదన్నారు.ఆన్‌లైన్‌లో యూడీఐడీ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా కార్డులు రావటం లేదన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకుని వికలాంగులకు గుర్తింపు కార్డులు ఇప్పించాలని కోరుతూ లేఖలో కోరారు.

ఆధ్యాత్మికం

అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న మహిళలు, భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: ఉత్తర నక్షత్ర, సంకష్టహర చతుర్థి పర్వదినాలను పురస్కరించుకుని గురువారం రాత్రి యైటింక్లయిన్‌కాలనీ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం అయ్యప్ప స్వామి మూల విరాట్‌కు పాల పంచామృతలతో అభిషేకం చేశారు. రాత్రి గణపతి స్వామి మూల విరాట్‌కు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అద్దంకి సారంగా చారి గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న భక్తులు

రామగుండం: పట్టణంలోని అయ్యప్ప ఆలయ 28వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివార్లకు అభిషేకం, ఉదయం పది గంటలకు హోమ దహనం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ వేడుకలను పాత రాజయ్య-కళావతి దంపతుల చేతుల మీదుగా నిర్వహించగా అధిక సంఖ్యలో గురుస్వాములు హాజరయ్యారు. ఈ వేడుకలలో ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్‌శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు కోలహాలం శ్రీనివాస్‌రావు, తాటిపెల్లి శివప్రసాద్, అయ్యప్ప గురుస్వాములు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రూ.లక్ష విరాళం

పాలకుర్తి: మండల కేంద్రంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో రేపటి నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న స్వామివారి బ్రహోత్సవాలకు గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మాదాసు సందీప్ రూ.1 లక్ష 116 విరాళంగా అందించారు. సర్పంచ్ దుర్గం జగన్, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు పోతుగంటి బ్రహ్మం, శిలగాని రాజేశం, విసారపు రమేశ్‌క విరాళం అందజేశారు.

కార్మికుల పక్షాన సీఐటీయూ పోరాటం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో అన్ని విభాగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారి పక్షాన పోరాటం చేస్తోంది సీఐటీయూ మాత్రమేనని ఆర్జీ-2 డివిజన్ కార్యదర్శి ఉల్లి మొగిలి అన్నారు. శుక్రవారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ సీఐటీయూ కార్యాలయంలో వార్షిక క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులకు ఒకటో కేటగిరి వేతన ఒప్పందం నుంచి 11వ వేతన ఒప్పందం వరకు కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. అంతేకాకుండా సింగరేణి బొగ్గు గనుల పరిరక్షణ కోసం పోరాడుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టుటకు అన్ని ట్రేడ్ యూనియన్లు, పార్టీలు కలసి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, భూమయ్య, లక్ష్మీనారాయణ, రాజేశ్, లక్ష్మీ రాజ్యం, వెంకట నర్సయ్య, కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ నిబంధనల మేరకే పనులు కేటాయించాం

రామగిరి: మండలంలో అభివృద్ధి పనులు చేయడానికి ప్రభుత్వ నిబంధనల మేరకే ఎంపీటీసీలకు నిధులను కేటాయించినట్లు ఎంపీడీవో రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించి వారి తీర్మానంతోనే పనులను కేటాయించినట్లు తెలిపారు. ఎంపీపీని అగౌరవ పరచడం గాని, అవహేళన చేయడం కాని చేయలేదని పేర్కొన్నారు.

గర్రెపల్లిలో రోడ్డుకు సీఎం కేసీఆర్ పేరు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిలో సీసీరోడ్డుకు కేసీఆర్ పేరును పెట్టినట్లు సర్పంచ్ వీరగోని సుజాత తెలిపారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా రూ.14 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డుకు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో ప్రారంభించి, కేసీఆర్ పేరు నామకరణం చేయనున్నట్లు తెలిపారు. దీనిక సహకరించిన ఎమ్మెల్యేకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభించిన ఎస్సై

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని గ్రామాల జట్ల నడుమ క్రికెట్ పోటీలను బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపకరిస్తాయని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీశ్, పెంచాల శ్రీధర్, సాగర్, వాసు, అన్వేష్, సంతోష్ తదితరులున్నారు.

కొనసాగుతున్న సీఎం క్రికెట్ పోటీలు

ఓదెల: మండల కేంద్రంలో సీఎంకేసీఆర్ కప్ క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని కొమిర, గుండ్లపల్లె గ్రామాల జట్లు తలపడ్డాయి. క్రికెట్ పోటీలలో పాల్గొన్న జట్లు హోరాహోరీగా తలపడతున్నాయి. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ మండలశాఖ అధ్యక్షుడు మ్యాడగొని శ్రీకాంత్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇప్పించాలి

ధర్మారం: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో కరెంట్ షాక్‌తో మరణించిన గేదెకు పరిహారం ఇప్పించాలని ధర్మారం మండలం బొమ్మరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చొక్కుల రాజేశం సంబంధిత అధికారులను కోరారు. ఎనిమిది నెలల క్రితం గ్రామశివారులో మేతకు వెళ్లిన గేదె విద్యుత్‌షాక్‌తో మృతి చెందిందని తెలిపారు. అధికారులు పరహారం ఇప్పిస్తామని చెప్పి ఎనిమిది నెలలు దాటినా పట్టించుకోవటం లేదని, వెంటనే అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని కోరారు.

నిత్యావసర సరుకులు అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బండారికుంటలో గల స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు అవసరమైన నిత్యావసర సరుకులను అందించారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన దివంగత వాయునందనాచారి జయంతి సందర్భంగా వారి సోదరుడు నీలయ్య స్ఫూర్తిలో మానసిక దివ్యాంగ విద్యార్థులకు భోజనం పెట్టించి, నిత్యావసర సరుకులు అందజేశాడు. కార్యక్రమంలో కోల శ్రీనివాస్ తదితరులున్నారు.

బైండోవర్ నిబంధనల ఉల్లంఘనపై జరిమానా

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని బోయిన్‌పేటకు చెందిన బొగ్గుల సాయి అఖిల్ అనే వ్యక్తి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు లక్ష రూపాయల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. నాటుసారా అమ్ముతూ మే నెలలో పట్టుబడిన సాయి అఖిల్‌ను స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి అక్టోబర్ నెలలో నాటుసారా అమ్ముతూ పట్టుబడినట్లు తెలిపారు. తహసీల్దార్ బండి ప్రకాష్ ఎదుట హాజరు పర్చగా, ఏడాది జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధించారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని రాంమందిర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఏరియాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్(ఏడీఈ) అడిచర్ల శ్రీనివాస్ తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని పీజీ సెంటర్, జనగాం, గౌతమినగర్, రాంమందిర్, అల్లూరు సబ్ స్టేషన్ల పరిధిలో నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్(ఏడీఈ) అడిచర్ల శ్రీనివాస్ తెలిపారు.

రామగుండం: పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీలు, ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ట్రాన్స్‌కో ఏఈ దామోదర్‌రావు తెలిపారు.

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, రొంపికుంట సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజేంద్రకుమార్ తెలిపారు.

యైటింక్లయిన్‌కాలనీ: అల్లూరు సబ్ స్టేషన్ పరిధిలో నేడు 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈలు శ్రీనివాస్, హరీశ్ తెలిపారు.